బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

జంగ్ తెలంగాణ 2023


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


బీ- ఫారమ్ అందుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: రాష్ట్ర రాజధానితో పాటు ఐటీజోన్‌కు అనుకునే ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం రూపు రేఖలు ఇప్పటికే మారిపోయాయని, అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడ బీఆర్ఎస్ ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లకు చెందిన బీఆర్ఎస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ఆయన తన నివాసంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమాలను జోడెద్దులుగా చేసి పాలన కొనసాగిస్తున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. వందల కోట్ల నిధులను రాబట్టి నియోజకవర్గంలో తాగు నీరు, రోడ్లు, డ్రైనేజీ, ఐటీ సంస్థలు, ఆట స్థలాలు, పార్కులు, శ్మశానవాటికలతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలను ఓటు అడిగే హక్కు మనకు మాత్రమే ఉందన్నారు. అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ గుర్తు చేసి వచ్చే ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్‌లో భారీ మెజార్టీ సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ నగరం చుట్టు పక్కల ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి మన వద్ద జరిగిందన్నారు.

మూసీ సుందరీకరణ..

భవిష్యత్తులో మూసీ సుందరీకరణ, వంతెనలు, గండిపేట చెరువు సుందరీకరణ, గోదావరి నీటితో గండిపేట, హిమాయత్‌సాగర్‌లను నింపడం, శంషాబాద్ వరకు మెట్రో నిర్మాణం లాంటి పనులను చేయాల్సి ఉందని, అవన్నీ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖాయాదగిరి, వైస్ చైర్మెన్ జి.వెంకటేష్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, సురేష్‌గౌడ్, బి. శ్రీరాములు, పార్టీ పరిశీలకుడు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్‌లతో పాటు కార్పొరేటర్‌లు, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బీ–ఫారమ్ అందుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్..

- ప్రకాష్‌గౌడ్ నాల్గోసారి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సోమవారం బీ- ఫామ్ అందుకున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు తన గెలుపునకు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఈసారి ప్రత్యర్థులెవరైనా భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కర్ణాటక ఎమ్మెల్యేకు స్వాగతం..


ఎమ్మెల్యే బీకే రాంమూర్తికి స్వాగతం పలికిన మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపునకు చేపట్టాల్సిన చర్యలు, పార్టీ పనితీరుపై దిశా నిర్దేశం చేసేందుకు వచ్చిన కర్ణాటక రాష్ట్రం జయనగర్ ఎమ్మెల్యే బీకే రామ్మూర్తికి మణికొండ బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నామన్నారు.

సోమవారం ఆయన బీజేపీ మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు అనితాదేవి నివాసంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, కౌన్సిలర్లు శ్వేతారవికాంత్‌రెడ్డి, ఎల్.వందనానగేష్, కో–ఆప్షన్ సభ్యులు జె.లక్ష్మీరాములు, నాయకులు ఎం. రాఘవరెడ్డి, సీహెచ్. ఇందిర, శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, ఆనంద్‌రావు తదితరులున్నారు.

వైఎస్ఆర్‌టీపీ టికెట్ కోసం..


టికెట్టు కోసం దరఖాస్తు చేసుకుంటున్న సదాల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్టు తనకు కేటాయించాలని కోరుతూ సోమవారం వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గం యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి ఆ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ నీలం రమేష్‌ను కలిసి దరఖాస్తు చేసుకున్నారు. నాయకులు గౌరీగారి ఆగమయ్య, ఎస్.శేఖర్‌రెడ్డి, వెంకటేష్, సదాల అనిల్ రెడ్డి, జగదీష్, ఆకుల దశరథ్ తదితరులున్నారు.

535 పోలింగ్ కేంద్రాలు.. 41 మంది అధికారులు


సెక్టోరల్ అధికారులతో సమావేశమైన ఆర్‌ఓ. మల్లయ్య

అత్తాపూర్: నియోజకవర్గంలోని 535 పోలింగ్ కేంద్రాల బాధ్యతలను 41 మంది సెక్టోరల్ అధికారులకు అప్పగించామని రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య అన్నారు. సోమవారం సెక్టోరల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికలు ముగిసేంత వరకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బాధ్యతలను సెక్టోరల్ అధికారులు చూస్తారన్నారు. ఆయా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు.

విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు పోలింగ్ కేంద్రానికి సంబంధించి ప్రతి ఒక్కటి పరిశీలించి లేనిచోట ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి 41 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల రోజు ఈవీఎం యంత్రాలను తరలించడంతో పాటు పోలింగ్ ముగిసిన అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందన్నారు. సిబ్బంది ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి సెక్టోరల్ అధికారులకు పూర్తి అధికారం ఉంటుందన్నారు. ఎన్నికల ప్రశాంతంగా ముగిసేలా ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

కౌంటింగ్‌కు లార్డ్స్ కళాశాల

రాజేంద్రనగర్: నియోజకవర్గం ఎన్నికల కౌంటింగ్ కోసం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ హిమయత్‌సాగర్‌లోని లార్డ్స్ కళాశాలను అధికారులు ఎంపిక చేశారు. గతంలో శంషాబాద్ పాలమాకులలోని కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంతో పాటు మరో రెండు నియోజకవర్గాల ఓట్ల బ్యాలెట్ బాక్స్ లార్డ్స్ కళాశాలలోనే భద్రపరిచి ఇక్కడే లెక్కింపు చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి అధికారులంతా కళాశాల ప్రాంతాన్ని పరిశీలించారు. పోలీసులు సైతం అనుమతులు ఇవ్వడంతో లార్డ్స్ కళాశాలలోనే స్ట్రాంగ్ రూమ్‌తో ఓట్ల లెక్కింపు కోసం కసరత్తులు ప్రారంభించారు.

- గత కార్పొరేషన్ ఎన్నికల్లో బండ్లగూడ కార్పొరేషన్‌కు చెందిన 22 డివిజన్ల ఓట్ల లెక్కింపును ఈ కళాశాలలోనే నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పక్కనే ఉన్న ఈ కళాశాల అనువుగా ఉండటంతో ఓట్ల లెక్కింపునకు వినియోగించుకునేందుకు అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఈ ప్రాంతంలోనే దాదాపు ఖరారు కావడంతో తగిన ఏర్పాట్లను ప్రారంభించారు.

పంపిణీ కోసం యూనివర్సిటీ..

నియోజకవర్గ పరిధిలోని 535 పోలింగ్ బూత్‌లకు అధికారులు, ఈవీఎంలతో పాటు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఎన్‌సీసీ గ్రౌండ్‌ను ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు పోలీసులు పరిశీలించారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంగణం నుంచే ఎన్నికల సామగ్రిని పోలింగ్‌బూత్‌లకు తరలించారు. ప్రస్తుతం 535 పోలింగ్ బూత్‌లకు ఇక్కడి నుంచే సామగ్రిని తరలించేందుకు అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాక్‌చర్చ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓంనగర్ కాలనీ, వివేకానంద కాలనీ, రాధా రియల్టర్, యాదాద్రికాలనీ, సత్యసాయి ఎన్ఆర్ఐ కాలనీ, గిరిధారి అపార్ట్‌మెంట్స్, రాఘవేంద్ర కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎల్‌వీ ప్రసాద్ ఫీడర్ పరిధిలోని కేటీటీ కాలనీ, దర్గాఖలీస్తాన్‌గూడ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఈ కోత ఉంటుందని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి


చెరువులో చేప పిల్లలను వదిలిన మత్స్యకారులు

మణికొండ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని వట్టినాగులపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బి.అరుణ్‌కుమార్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని ఎర్రగుంట, గౌని చెరువులలో 50 వేల చేప పిల్లలను సంఘం సభ్యులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులలో మురుగు కలపడంతో చేపల పెంపకానికి అవరోధంగా మారుతుందని, మురుగునీరు చెరువులలో కలపకుండా మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పట్టణ ప్రాంతాలలో మత్స్య కారుల జీవనోపాధికి చెరువులే ఆధారమని, అలాంటి వాటిని మురికి కూపాలుగా మార్చడం మానుకోవాలన్నారు. గంగయ్యముదిరాజ్, బాల్‌రాజ్, శ్రీనివాస్, దర్శన్, కృష్ణ, మల్లేష్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ ప్రయాణికులకు ఆర్టీసీ ప్రైజ్‌మనీ

రాజేంద్రనగర్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు రూ.11 లక్షల ప్రైజ్‌మనీ అందజేస్తున్నట్లు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్ ప్రకటించారు. ఈనెల 21, 22, 23, 28, 29, 30వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే 110 మంది ప్రయాణికులకు రూ.11 లక్షల ప్రైజ్‌మనీ అందజేయనున్నామన్నారు. రీజియన్ పరిధిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900ల చొప్పున బహుమతులను అందిస్తామన్నారు. దీనికి ప్రయాణికులు టికెట్టు వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థి స్కాలర్‌షిప్‌కు ఎంపిక


సీహెచ్. గణేష్

రాజేంద్రనగర్: ఆల్ ఇండియా స్థాయిలో ఇంటర్మీడియట్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సైన్స్ రంగం వైపునకు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇచ్చే 'షీ' స్కాలర్‌షిప్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థి సీ.హెచ్.గణేష్ ఎంపికయ్యాడు. ఈ స్కాలర్‌షిప్‌లో భాగంగా ప్రతి ఏటా రూ.80 వేల చొప్పున 5 ఏళ్లకు రూ. 4 లక్షల స్కాలర్‌షిప్ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఈ కళాశాల నుంచి 12 మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. షీ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గణేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, సిబ్బంది మాన్య, స్వప్న, కిరణ్‌కుమార్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, పరశురాములు, మురళి, కరుణాకర్, శ్రీజన్య, నవీన్, స్వాతి, గోపీకృష్ణ రెడ్డి, పార్థసారథి, శశిధర్, భరత్‌రాజ్, నర్సింగ్ అభినందించారు.

అడవి వ్యవసాయానికి ప్రాధాన్యం


ప్రచురణలను విడుదల చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ : మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో అడవి వ్యవసాయానికి ప్రాధాన్యత పెరుగుతుందని భారత వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.కె చౌదరి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సమన్వయ పరిశోధనా పథకం (అగ్రోఫారెస్ట్రీ) సంయుక్తంగా మూడు రోజుల పాటు వార్షిక గ్రూప్ మానిటరింగ్ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు సోమవారం ప్రారంభం కాగా.. ముఖ్య అతిథిగా ఎస్.కే చౌదరి పాల్గొన్ని మాట్లాడారు. అటవీ వ్యవసాయానికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించి మన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వాటిని అమలుపరచాలని సూచించారు. నాణ్యమైన అటవీ మొక్కలు అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను పాటించడంతో అగ్రోఫారెస్టు కీలక పాత్ర పోషించనుందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ.. అడవులను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పలు కేంద్రాలు ప్రచురించిన పుస్తకాలు, ప్రచురణలను విడుదల చేశారు. ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ అరుణాచలం ,పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, క్రీడా సంచాలకులు డాక్టర్ వీ.కే సింగ్, రమాంజనేయులు వివిధ కేంద్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

సాయికృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసిన నూతన కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: బుద్వేల్ సాయికృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ యూత్ అధ్యక్షులు పుంజాల సాయిగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయికృష్ణ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, కమిటీ సభ్యులందరినీ అభినందించారు.

నూతన కమిటీ సభ్యులు వీరే..

బుద్వేల్ సాయికృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కె.అనగయ్య, నాగ్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎస్.రమేష్‌యాదవ్, మహ్మద్ హనీపుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జే.ఎస్.ఆర్.మూర్తి, రామకృష్ణ, కోశాధికారిగా రామ్ రెడ్డి, సలహాదారులుగా పి.భూపాల్‌రెడ్డి, రంగా స్వామి తదితరులు ఎన్నికయ్యారు.

పాదయాత్రగా శబరిమలకు..



మణికొండ: అయ్యప్పస్వామి మాలధారణ చేసి కాలి నడకన శబరిలోని స్వామి వారిని దర్శించుకునేందుకు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ నుంచి 9 మంది స్వాములు సోమవారం బయలుదేరారు. ఇరుముడులు కట్టుకుని సోమవారం బయలు దేరిన వారు 35 రోజుల్లో శబరికి చేరుకుని స్వామి వారిని దర్శించుకోనున్నట్లు పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములకు ఖానాపూర్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు, నాయకులు ఘనంగా వీడ్కోలు పలికి శుభప్రదంగా దర్శనం చేసుకుని రావాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్..

నగదు స్వాధీనం

మణికొండ: వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని లెక్కా పత్రం లేని నగదు రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు ఈ సారి ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంచిరేవుల చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. ఓ వాహనంలో తరలిస్తున్న రూ.17,65,090లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

- నార్సింగిలోని యూనియన్ బ్యాంక్ వద్ద మరొకరి వద్ద రూ.15లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని వారు పేర్కొన్నారు. హైదర్షాకోట్‌లో రెవెన్యూ అధికారి జంగయ్య నేతృత్వంలోని బృందం నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఓ వాహన దారుని వద్ద రూ. 5లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఇన్‌కమ్‌టాక్స్ అధికారులకు అప్పగించినట్లు అధికారి వివరించారు.

ఎర్రకుంట చెరువులో వ్యక్తి గల్లంతు


ఆచూకీ కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: చెరువులో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్‌కాలనీ ఎర్రకుంట సమీపంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో బంగారు మైసమ్మ వైన్స్‌లో మద్యం సేవించిన గుర్తు తెలియని వ్యక్తి చెరువు అంచుకు వెళ్లి మూత్రవిసర్జన చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. కేకలు వేయడంతో వైన్స్ ఎదుట ఉన్న ఓ యువకుడు అతడిని కాపాడేందుకు ప్రయత్నించాడు. కానీ చెరువులో బురద ఉండటంతో మునిగిపోయాడు. వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బందికి తెలిపారు. జేసీబీ సాయంతో ఫైర్ సిబ్బంది చెరువులోకి దిగి గాలించారు. ఫలితం లేకపోవడంతో గజ ఈతగాళ్లను చెరువులోకి దింపగా.. ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం నుంచి చెరువులో వెతికిస్తామని సీఐ మధు వివరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కొల్లాపూర్‌కు చెందిన కర్నె శివుడు (33) జడ్చర్లలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. నగరంలోని చంపాపేటలో భార్య సంధ్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. సోమవారం అతను కాచిగూడ – మలక్‌పేట రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తన చావుకు ఎవరూ కారణం కాదని రాసిన సూసైడ్ నోట్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వాహన తనిఖీల్లో రూ. 18 లక్షలు స్వాధీనం..

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి మరో మూడు వాహనాల్లో ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు రూ. 18,88,000లను స్వాధీనం చేసుకున్నారు. ఓ వాహనంలో రూ. 15,38,000లు, మరో వాహనంలో రూ. 2లక్షలు, రూ. 1.50లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

గాయత్రి దేవీగా అమ్మవారు


కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ తదితరులు



ఓయూ కాలనీలో..

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల్లో నెలకొల్పిన అమ్మవారి మండపాలు, దేవాలయాలలో ఘనంగా పూజలు కొనసాగుతున్నాయి. రెండో రోజు అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మణికొండ ఓయూ కాలనీలోని దుర్గామాత ఆలయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రోజూ ఓ అలంకరణతో అమ్మవారిని సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం నిర్వహించే కుంకుమార్చన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అత్తాపూర్: దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అత్తాపూర్ హైదర్‌గూడలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత మండపంలో పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం పూజా కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


పూజలో కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్


నార్సింగి దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు



'మీ కడుపు నిండా' తెలుగు వారి రుచులు

మణికొండలో ఏపీ పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా 'మీ కడుపు నిండా' తెలుగు వారి రుచులు హోటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వారికి నచ్చే విధంగా వెజ్, నాన్ వెజ్ వంటకాలు ఉంటాయని అన్నారు. అందరూ ఈ రెస్టారెంట్‌ను ఆదరించాలని మంత్రి రోజా పేర్కొన్నారు.